


రేపు ఐటీఐలో జాతీయ అప్రెంటిషిప్ మేళా

ఉట్నూర్, జనవరి 6: మండలకేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలోని గిరిజన పారిశ్రామిక శిక్షణ సంస్థలో సోమవారం ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిషిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ రమేష్‌బాబు తెలిపారు. ఐటీఐలో ఉత్తీర్ణులైన ఉమ్మడి జిల్లాలోని అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఉదయం 10గంటలకు తాము చదువుకున్న సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని, అంతకుముందే వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేసుకుని ఉండాలన్నారు. అదనపు వివరాలకు ప్రిన్సిపాల్ ఫోన్ నెం. ద్వారా 9490202037 సంప్రదించాలని పేర్కొన్నారు.



ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న ఇన్‌చార్జి మంత్రి సీతక్క (ఫైల్)



దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు (ఫైల్)

దరఖాస్తుల.. వెల్లువ

- జిల్లాలో పెద్దసంఖ్యలో అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ
- ప్రజాపాలన కార్యక్రమం ద్వారా మొత్తం 2లక్షల 24,136 లక్షల అర్జీలు
- ఈనెల 17 వరకు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పూర్తి చేయనున్న అధికారులు
- ఐదు గ్యారెంటీలకు దరఖాస్తు చేసుకున్న ప్రజలు
- లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యంపై అనుమానాలు
- 6 గ్యారెంటీల అమలుపై సర్వత్రా ఆసక్తి
- ప్రజాపాలన దరఖాస్తులకు ముగిసిన గడువు
- జిల్లావ్యాప్తంగా 468 గ్రామ పంచాయతీలు, మున్సిపల్ పరిధిలోని 49 వార్డుల్లో దరఖాస్తుల ప్రక్రియ పూర్తి

ఆదిలాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన, అభయ హస్తం పేరుతో గ్యారెంటీ పథకాలను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే డిసెంబరు 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు ఐదు గ్యారెంటీ పథకాల అమలుకు దరఖాస్తులను స్వీకరించింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేసేందుకు సిద్ధమవుతుంది. ఇప్పటికే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. మిగితా పథకాలను దశల వారీగా అమలు చేసేందుకు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. జిల్లాలో 468 గ్రామ పంచాయతీలు, మున్సిపల్ పరిధిలోని 49 వార్డుల్లో జిల్లా అధికారులు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ నెల 17 వరకు వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పూర్తి చేయనున్నారు. ఇప్పటికే సంబంధిత అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారెంటీ స్కీములలో మొదట మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత వంటి ఐదు గ్యారెంటీలకు మాత్రమే దరఖాస్తులను స్వీకరించారు. యువ వికాసం పథకాన్ని తర్వాత అమలు చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో మరింత భరోసాను కల్పించేందుకు ఆరు గ్యారెంటీ స్కీములను అమలు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుంది. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పథకాలను పక్కాగా అమలు చేసేందుకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఎలాంటి అవకతవకలు, అవినీతికి తావివ్వకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటోంది. జిల్లాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించి పర్యవేక్షణ చేపడుతోంది.

భారీగా దరఖాస్తులు

ప్రజాపాలన, అభయహస్తం పేరిట ప్రభుత్వం చేపడుతున్న ఐదు గ్యారెంటీ పథకాలకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. గడిచిన ఎనిమిది రోజుల్లో మొత్తం జిల్లావ్యాప్తంగా 2లక్షల 24,136 దరఖాస్తులు వచ్చినట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. అయితే జిల్లాలోని 17 మండలాల పరిధిలో 1,42,651 కుటుంబాలు ఉన్నాయి. ఈ కుటుంబాలకు సంబంధించి 1,75,481 దరఖాస్తులు వచ్చాయి. అయితే కుటుంబానికి ఒక్కే దరఖాస్తు మాత్రమే తీసుకోవాలని మొదట అధికారులు నిర్ణయించినప్పటికీ.. అధికంగానే దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు పేర్కొంటున్నారు. అలాగే మున్సిపల్ పరిధిలోని 49 వార్డుల్లో 48,393 కుటుంబాలకు సంబంధించి 48,655 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇంకా మిగిలిన కుటుంబాల దరఖాస్తులను తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో స్వీకరిస్తారు. ఒక్కో కుటుంబంలో రెండు, మూడు దరఖాస్తులు కూడా చేసుకున్నట్లు తెలుస్తుంది. రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా దరఖాస్తులను తీసుకోవడంతో దరఖాస్తుల సంఖ్య భారీగా పెరిగినట్లు తెలుస్తుంది. అలాగే గ్యారెంటీలతో సంబంధం లేకుండా కొత్త రేషన్‌కార్డులు, ఇతర సమస్యలపై మరో 29,145 దరఖాస్తులు అదనంగా వచ్చినట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది.

లబ్ధిదారుల ఎంపిక ఎలా?

ప్రజాపాలన దరఖాస్తుల గడువు ముగియడంతో ఇక లబ్ధిదారుల ఎంపికను ఎలా చేపడుతారన్నదే చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీ నేతలు చెప్పిన వారికే ప్రభుత్వ పథకాలు దక్కుతాయా? లేదా లబ్ధిదారుల అర్హత, ఆదాయ, కుటుంబ పరిస్థితులను బట్టి ఎంపిక చేపడుతారా? అనే దానిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దేని ఆధారంగా లబ్ధిదారుల ఎంపికను చేపడుతారనేది ఇంకా స్పష్టత లేదని అధికారులు చెబుతున్నారు. వచ్చిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తికాగానే ప్రభుత్వం విధివిధానాలను ఖరారు చేసే అవకాశం ఉంది. దీని ఆధారంగానే లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని తెలుస్తుంది. అయితే ఆరు గ్యారెంటీ పథకాల అమలులో అధికార పార్టీ నేతల జోక్యం ఉంటుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. త్వరలోనే గ్రామ, వార్డు స్థాయిలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసి వారు సూచించిన వారికే గ్యారెంటీ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్న ప్రచారం కూడా కొనసాగుతోంది. ఇదే జరిగితే గందరగోళ పరిస్థితులకు దారి తీసే అవకాశం ఉందంటున్నారు.

ముగిసిన గడువు

ఐదు గ్యారెంటీ పథకాలకు ప్రభుత్వం ఇచ్చిన దరఖాస్తు గడువు శనివారంతో ముగిసింది. ఇక పథకాల అమలు పైననే సర్వత్రా ఆసక్తి కనిపిస్తోంది. ఇప్పటికే అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జీరో టికెట్‌తో మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరగడంతో ఆర్టీసీ బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. త్వరలో అమలు చేయనున్న మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత లాంటి పథకాల అమలు ఎలా ఉంటుందోనని ఆసక్తి నెలకొంది. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయడం ఎలా సాధ్యమన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 29 రోజుల సమయం గడిచిపోతోంది. మళ్లీ ప్రతీ నాలుగు మాసాలకోసారి ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను చేపడుతామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఇప్పటికే కొనసాగుతున్న రైతుబంధు, ఆసరా పింఛన్ల పరిమితిని ఎప్పటి నుంచి పెంచుతారనేది హాట్‌టాపిక్‌గా మారింది. ఇలా మిగితా పథకాల అమలు కూడా ఎలా ఉంటుందోనన్న ఆసక్తి సర్వత్రా కనిపిస్తోంది.

మండలాల వారీగా వచ్చిన ప్రజాపాలన దరఖాస్తులు ఇలా..

మండలం పేరు	కుటుంబాలు	దరఖాస్తులు
1. ఆదిలాబాద్‌రూరల్	8615	11317
2. బజార్‌హత్నూర్	6462	9559
3. బేల	9606	12661
4. భీంపూర్	5634	8055
5. బోథ్	11579	14842
6. గాదిగూడ	5025	5687
7. గుడిహత్నూర్	10544	10209
8. ఇచ్చోడ	11384	13849
9. ఇంద్రవెల్లి	9862	12276
10. జైనథ్	14438	17444
11.మావల	1653	1809
12. నార్నూర్	9306	8173
13. నేరడిగొండ	7121	8475
14. సిరికొండ	4439	5438
15. తలమడుగు	11556	11717
16. తాంసి	4015	5709
17. ఉట్నూర్	19534	18561
18. ఆదిలాబాద్‌అర్బన్	50045	48655
మొత్తం	2,00,828	2,24,136

సంక్షిప్త సమాచారం



జడ్పీ చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కొండూరు గంగాధర్

జడ్పీ చైర్మన్‌ను కలిసిన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 6: తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరుగంగాధర్ ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. దీనిలో భాగంగా తాను సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన నేపథ్యంలో ఆదిలాబాద్‌లోని జడ్పీ కార్యాలయంలో శనివారం జడ్పీ చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ గంగాధర్‌ను అభినందించారు.

బోధనేతర పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానం

నేరడిగొండ, జనవరి 6: మండలంలోని కేజీబీవీలో బోధనేతర ఖాళీలు 2 హెడ్‌కుక్, 3 అసిస్టెంట్ కుక్ పోస్టుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈఓ భూమారెడ్డి అన్నారు. ఈ పోస్టులకు మహిళలు మాత్రమే అర్హులని కనీస విద్యార్హత 7వ తరగతి పాసై ఉండాలని 18 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల లోపు వయస్సు ఉండాలని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 4సంవత్సరాలు వికలాంగులకు 10 సంవత్సరాల మినహాయింపు ఉంటుందన్నారు. దరఖాస్తులను ఈనెల 8వ తేదీ నుంచి 10వ తేదీలోగా ఎంఈవో కార్యాలయంలో అందజేయాలని కోరారు. మరింత సమాచారం కోసం ఎమ్మార్సీ కార్యాలయంలో సంప్రదించాలని వారు పేర్కొన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం

ఇంద్రవెల్లి, జనవరి 6: టీఎస్ యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని శనివారం మండల కేంద్రంలో రాష్ట్ర కమిటీ సభ్యులు లక్ష్మణ్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ సమక్షంలో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గణేష్, ప్రధాన కార్యదర్శిగా సుకుమార్, ఉపాధ్యక్షుడిగా ప్రేమ్‌సింగ్, కోశాధికారిగా శ్రీకాంత్, కార్యదర్శులుగా సత్యనారాయణ, శ్రీనివాస్, గంగారాంలతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ప్రభుత్వ టీచర్‌పై కేసు నమోదు

ఉట్నూర్, జనవరి 6: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ప్రతాప్‌సింగ్‌పై కేసు నమోదు చేశామని ఉట్నూర్ ఎస్సై మనోహర్ తెలిపారు. ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్న ఏడేళ్ల చిన్నారిపై టీచర్ అసభ్యకరంగా ప్రవర్తించాడని బాలిక తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపామని తెలిపారు.



ఇందిరా ప్రియదర్శిని స్టేడియం



ముగ్గుల పోటీలకు సిద్ధం చేసిన గ్రౌండ్

నేడే 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు

- ఉదయం 9గంటల నుంచి ప్రారంభం

ఆదిలాబాద్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంకు ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు బెంగళూరు.. రియల్ పార్టనర్ స్వర్ణసీమ సుకేతన' వారి సహకారంతో ఆదివారం నిర్వహిస్తారు. జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించే ముత్యాల ముగ్గుల పోటీల ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆసక్తి గల మహిళలు ముగ్గు, సంబంధిత రంగులతో ఉదయం 9గంటలకు ఇందిరా ప్రియదర్శిని స్టేడియానికి చేరుకోవాల్సి ఉంటుంది. అంతేకాకుండా ఈ పోటీలలో గెలుపొందిన మహిళలకు మొదటి బహుమతిగా రూ.6 వేలు, రెండవ బహుమతిగా రూ.4 వేలు, మూడవ బహుమతిగా రూ.3వేలను అందిస్తారు. మహిళలు, యువతులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలి.

పది పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయండి

- ధన్నూర్ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేసిన బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్
- కాన్రెడ్డి వాగు వద్ద బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ

బోథ్, జనవరి 6: విద్యార్థులను పదవ తరగతి పరీక్షల కోసం సిద్ధం చేయాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పేర్కొన్నారు. శనివారం ధన్నూర్ గ్రామ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల కోసం విద్యార్థులను సిద్ధం చేయాలని ఉపాధ్యాయులను కోరారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో నిర్మిస్తున్న పాఠశాల భవనాన్ని పరిశీలించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను గ్రామస్థులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి ఈ సందర్భంగా తీసుకువచ్చారు.



బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

- రామారావు మహరాజ్ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ

మండలంలోని కంటిపల్లి గ్రామంలో సంత్ రామారావు మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన కోసం శనివారం ఎమ్మెల్యే జాదవ్ అనిల్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఎమ్మెల్యేను ఘనంగా స్వాగతించి సన్మానించారు. ఆయన వెంట బోథ్ ఇచ్చోడ ఎంపీపీలు తుల శ్రీనివాస్, నిమ్మల ప్రీతంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మాన్సింగ్, ఆత్మ చైర్మన్ మల్లెపూల శభాష్, సహకార సంఘం చైర్మన్ కదం ప్రశాంత్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, తదతరులు పాల్గొన్నారు.

- రూ.2కోట్ల 25 లక్షల వ్యయంతో బ్రిడ్జి నిర్మాణం

బోథ్: బోథ్ పట్టణ సమీపంలోని కాన్రెడ్డి వాగు వద్ద వర్షాకాలం బ్రిడ్జి కొట్టుకుపోవడంతో నూతనంగా బ్రిడ్జి నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే జాదవ్ అనిల్ భూమిపూజ చేశారు. రెండు కోట్ల 25 లక్షలతో వర్షాకాలం లోపు బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తిచేయడం జరుగుతుందన్నారు. ఈ రూట్‌లో బ్రిడ్జి తెగిపోవడం వల్ల దాదాపు 14 గ్రామాల ప్రజలకు ఇబ్బందులు వర్షాకాలంలో తలెత్తాయన్నారు. దీంతో ప్రభుత్వం నిధులు మంజూరీ ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల శ్రీనివాస్, సర్పంచ్ సురేందర్ యాదవ్, సోనాల సర్పంచ్ సి.సదానందం, మండల పార్టీ కన్వీనర్ నారాయణరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



దరఖాస్తుల ఎంట్రీ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

- పరిశీలించిన కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 6: ప్రజాపాలన దరఖాస్తుల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పీఎస్ అన్నారు. శనివారం స్థానిక నలంద కళాశాలలో నిర్వహిస్తున్న డాటాఎంట్రీ నమోదు ప్రక్రియను పరిశీలించి ఆపరేటర్లకు ఆయన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన దరఖాస్తులను ఎలాంటి తప్పులు దొర్లకుండా నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆధార్, రేషన్‌కార్డు, సెల్ నెంబర్లను సరి చేసుకుని నమోదు చేయాలన్నారు. నిర్దేశించిన సమయంలోగా దరఖాస్తుల నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ శైలజ, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ జాదవ్‌కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అదనపు కలెక్టర్ వికాస్ మహతో

కొలాం గిరిజనుల గ్రామాల అభివృద్ధికి చర్యలు : అదనపు కలెక్టర్

ఇంద్రవెల్లి, జనవరి 6: కొలాం గిరిజనుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్నిచర్యలు తీసుకుంటుందని అదనపు కలెక్టర్ వికాస్‌మహతో అన్నారు. శనివారం మండలంలోని గిన్నేరాలోని కొలాంగూడ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జన్ మన్ పథకంలో భాగంగా పీవీటీజీ గ్రామాల్లో చేపట్టాల్సిన పక్కా గృహాలు, రహదారులు, ఇంటర్నెట్ సేవలు, విద్యుత్, తాగునీటి సరఫరా, అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు, సబ్ సెంటర్ల భవనాలు, పాఠశాలల భవనాల నిర్మాణాలు చేపట్టడానికి అవసరమైన మౌలిక వసతులపై అవగహన కల్పించారు. ఇందులో ఆదివాసీ నాయకులు ఆర్కా ఖమ్ము, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ నవీకరణ కోసం.. నానా తిప్పలు!!


ఆధార్‌కార్డు అప్‌డేట్ తిప్పలు అంతా ఇంతా కావు. ఆధార్ నవీకరణ కోసం జనాలు నానా అవస్థలు పడుతున్నారు. కొద్ది పాటి కేంద్రాలు మాత్రమే ఉండడంతో పల్లెల నుంచి పట్టణానికి వరుస కడుతున్నారు. గంటల తరబడి వరుసలతో నిలబడుతూ ఇబ్బందులు పడుతున్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ ఎదురుగా ఉన్న బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద పెద్దసంఖ్యలో లబ్ధిదారులు క్యూకట్టారిలా..


(- ఆంధ్రజ్యోతి, ఫొటోగ్రాఫర్)






జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ వద్ద ఆధార్ అప్‌డేట్ కోసం బారులు తీరిన ప్రజలు









వివరాలు వెల్లడిస్తున్న ఆదిలాబాద్ డీఎస్పీ ఉమేందర్

హత్యాయత్నం కేసులో కౌన్సిలర్ అరెస్టు

● ఆదిలాబాద్ డీఎస్పీ ఉమేందర్

మావల, జనవరి 6: యువకుడి హత్యాయత్నం కేసులో ప్రధాన నిందితుడు కౌన్సిలర్ ఉష్కం రఘుపతిని శనివారం మావల పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఆదిలాబాద్ డీఎస్పీ ఉమేందర్ విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. డీఎస్పీ కథనం ప్రకారం.. ప్రేమవ్యవహారంలో తన కూతురితో మాట్లాడుతున్న వంశీని ఒకసారి తన ఫామ్ హౌస్‌కి పిలిపించుకుని మందలించాడు. తన కూతురితో వెంటపడితే చంపేస్తానని బెదిరించాడు. ఆ తర్వాత కూడా వారు మాట్లాడుకోవడాన్ని తెలుసుకున్న రఘుపతి వంశీని చంపాలని నిర్ణయించుకున్నాడు. ఇటీవలే జైలు నుండి విడుదలైన రవిని ఎన్నికల ప్రచారంలో కలిశాడు. ఒక వ్యక్తిని చంపాలని అందుకు రూ.15 లక్షలు ఇస్తానని రవితో ఒప్పందం చేసుకొని ఎన్నికల తర్వాతనే హత్య చేయాలని సూచించాడు. రవి తన మిత్రుడు అశోక్ చౌహన్‌తో కలిసి రఘుపతి ఆఫీస్‌కు వెళ్లాడు. ఆఫీస్ ముందు నుంచివెళుతున్న వంశీని చూపించాడు. ఎవరికి అ నుమానం రాకుండా ఉండేందుకు జీపుతో ఢీ కొట్టిస్తే యాక్సిడెంట్ కేసుగా నమోదు అవుతుందని భావించారు. అందుకు అశోక్ తన మిత్రుడైన దిల్షాన్ ద్వారా జీపును తెప్పించాడు. అనంతరం రవి, అశోక్ ఒకరోజు ముందు 17తేదీన వంశీ ఇంటికి వెళ్లి రెక్కీ నిర్వహించారు. ప్రతీ రోజు వంశీ ఉదయం పాల కేంద్రానికి వెళ్తాడన్న సమాచారం తెలుసుకున్నారు. అనుకున్న పథకం ప్రకారం మరుసటి రోజు 18వ తేదీన పాల కేంద్రానికి స్కూటీపై వెళ్తున్న వంశీని వెంబడించారు. మావల స్మశాన వాటిక సమీపంలో వంశిని వెనుక నుంచి జీపుతో ఢీ కొట్టారు. జీపును వెనుకకు తీసుకొని మరోసారి వంశీ స్కూటీని గుద్దే క్రమంలో ఎలక్ట్రిక్ స్తంభం విరిగి స్కూటీపై పడింది. దీంతో రవి, అశోక్‌లు అక్కడి నుండి పారిపోయారు. వంశీ తీవ్రంగా గాయపడిన విషయం బయటకు రావడంతో తెలుసుకున్న రఘుపతి, తన భార్య అరుం ధతీలు పారిపోయారు. వంశీ తండ్రి ఫిర్యాదు ఆధారంగా విచారణ చేపట్టి గత నెల 23న రవి, అశోక్, దిల్షాన్, సహకరించిన రాజు, గంగన్నలను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. పరారీలో ఉన్న ఏ1 నింధితుడు రఘుపతిని శనివారం మావల బైపాస్ సమీపంలో పట్టుకొని కారు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఏ2 నిందితురాలు రఘపతి భార్యా అరుంధతికి హైకోర్టు బెయిల్ మంజూరు చేసిందన్నారు. కాగా ఏ1 నిందితుడు ఉష్కం రఘుపతిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వెల్లడించారు.



దగ్ధమవుతున్న పత్తి బేల్లపై మంటలను ఆర్పుతున్న దృశ్యం

జిన్నింగ్ మిల్లులో అగ్ని ప్రమాదం

● నిప్పురవ్వలు పడి పత్తి బేలు దగ్ధం

బోథ్, జనవరి 6: మండలకేంద్రం సమీపంలోని సాయి దత్త జిన్నింగ్ ఫ్యాక్టరీలో శనివారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ సంఘటన జిన్నింగ్ కోసం మిషన్ల వద్ద వేసిన పత్తి దగ్ధం కాగా అక్కడే ఉన్న పత్తి బేల్లపైన నిప్పు రవ్వలు పడి కొన్ని పత్తి బేలు స్వల్పంగా కాలిపోయాయి. జిన్నింగ్ అవుతున్న సమయంలో మిషన్లలో చెలరేగిన మంటలు జిన్నింగ్ అవుతున్న పైప్‌లైన్‌లోకి వెళ్లడంతో కొంత సైత దగ్ధమైంది. దీంతో లక్షన్నర మేరకు నష్టం జరిగినట్లు సమాచారం. కాగా అగ్ని ప్రమాదం జరిగిన విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదని పోలీసులు పేర్కొన్నారు.

రూ.నాలుగు లక్షల నగదు అపహరణ

ఉట్నూర్, జనవరి 6: మండల కేంద్రంలోని ఫకీర్‌గుట్టలో మహమ్మద్ గౌస్ ఇంట్లో శుక్రవారం రాత్రిదొంగలు పడి నాలుగు లక్షల నగదుతో పాటు నాలుగు తులాల బంగారం అపహరించినట్లు బాధితుడు మహమ్మద్‌గౌస్ తెలిపారు. ఆయన కథనం మేరకు... శుక్రవారం రాత్రి స్థానికంగా జరిగిన బంధువుల పెండ్లికి ఇంటిల్లిపాది వెళ్లడంతో ఇంట్లో ఎవరు లేరని గుర్తించిన దొంగలు ఇంట్లో చొరబడి నగదుతో పాటు బంగారం తీసుకు వెళ్లారని తాము పెళ్లి నుంచి ఇంటికి వచ్చేసరికి తలుపుల తాళ్లల్లో పగులగొట్టి ఉండడంతో ఇంట్లో అల్మారాలు పరిశీలించగా నగదు, బంగారం పోయాయని తెలిపారు.కూతురు వివాహం కోసం నగదు బంగారం సిద్ధం చేసుకు న్నామని బాధితుడు విలపిస్తూ తెలిపారు. ఈ మేరకు ఉట్నూర్ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. పంచనామ నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మనోహర్ తెలిపారు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు.. తగ్గుతున్న చలి

● భీంపూర్‌లో 14.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

ఆదిలాబాద్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో రాత్రి ఉష్ణోగ్రతలు పెరుగడంతో చలి తీవ్రత తగ్గుముఖం పడుతోంది. శనివారం జిల్లా గరిష్ఠ ఉష్ణోగ్రత 30.3 డిగ్రీలు నమోదు కాగా, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 16.2 డిగ్రీలుగా నమోదైంది. అత్యల్పంగా భీంపూర్ మండలంలో 14.3 కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే నేరడిగొండ మండంలో 14.4. బజార్‌హత్నూర్ మండలంలో 14.6, తలమడుగు మండలంలో 15.0, ఉట్నూర్ మండలంలో 15.3, బేల మండలంలో 16.4, నార్నూర్ మండలంలో 17.0 కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇలా జిల్లావ్యాప్తంగా 20 డిగ్రీల లోపు కనిష్ఠ ఉష్ణోగ్రతుల నమోదు కావడంతో కొంతమేరకు చలి ప్రభావం కనిపిస్తుంది. ఉదయం రాత్రి వేళల్లో చలి తీవ్రత పెరుగుతోంది.

'పార్టీని మరింత బలోపేతం చేయండి'

నేరడిగొండ, జనవరి 6: బోథ్ నియోజకవర్గంలో పార్టీని రాబోవు ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మరింత బలోపేతం చేయాలని, నాయకులు సమన్వయంతో పని చేసి క్యాడర్‌ను బలోపేతం చేయాలని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ పిలుపునిచ్చారు. ఇచ్చోడ, గుడిహత్నూర్, బజార్‌హత్నూర్, సిరికొండ మండలాల ముఖ్య నాయకులతో చర్చిస్తూ రాబోవు మండల జిల్లాపరిషత్, సర్పంచ్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిచే విధంగా పార్టీని ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని సూచించారు. నాయకత్వ లక్షణాలున్న యువతను పార్టీలోకి ఆహ్వానించి యువకులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో పని చేసి.. ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉన్న సీనియర్లు అందరిని తిరిగి ఆహ్వానించాలని, గ్రామాలలో ఉన్న స్థానిక సమస్యలను గుర్తించి అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ మండల పార్టీ నాయకులు కుంట ప్రవీన్‌రెడ్డి, నాగోరావ్, గుడిహత్నూర్ మండల నాయకులు అంకత్‌రవి, సీహెచ్ మహేందర్, మాదవ్, విష్ణు, శంకర్, మారుతి, షకీల్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్

అడవుల ప్రైవేటీకరణను ఆపాలి

● షెడ్యూల్ ప్రాంతాన్ని హరిస్తున్న బీజేపీ : టీఏజీఎస్

ఇంద్రవెల్లి, జనవరి 6: దేశంలోని అడవులను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే విధానాన్ని మానుకోవాలని, షెడ్యూల్ ప్రాంతాన్ని బీజేపీ హరించడం ఆపాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన (టీఏజీఎస్) జిల్లా అధ్యక్షులు ఉయిక విష్ణు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని పిప్రి గ్రామంలో సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆదివాసీల హక్కులను, రాజ్యాంగం కల్పించిన చట్టాలను పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు కుత్రలు చేస్తున్నదని విమర్శించారు. చత్తీస్‌ఘడ్ ప్రభుత్వం ఏర్పడి నెలకూడా కాకముందే ఆదివాసీ సీఎంను నియమించామంటూనే 4 లక్షల ఎకరాల అడవిని అదాని కంపెనీకి కట్టబెట్టడమేంటని ప్రశ్నించారు. ఆదీవాసీలు వారి సంప్రదాయక జీవన విధానంపై, పోరాడి సాధించిన పీసా, అటవీ హక్కుల చట్టం, ఏజెన్సీ చట్టాలను నీరుగార్చి అడవిలోని ఖనిజా సంపదలని అదానిలాంటి కొద్దీ మంది కార్పొరేట్లకు అప్పగించేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివాసీల ఉనికి కి, పర్యావరణం, మానవాళికి ప్రమాదం తెచ్చే బీజేపీని ప్రజల్లో ఎండగట్టాలని, లోకసభ ఎన్నికల్లో దాన్ని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు కోరెంగ నర్సింగ్ రావు, కోరెంగ శంభు, విఠల్, నాగోరావు, జలపతి, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఆటోను దగ్ధం చేసిన దుండగులు

ఖానాపూర్, జనవరి6: పట్టణంలోని డబుల్‌బెడ్ రూమ్‌లో నివాసం ఉంటున్న మునుగురి పరమేశ్వర్ ఆటోను శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై లింబాద్రి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి కేసుదర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



డైరీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పద్మశాలి ఇంజనీర్ల సంఘ డైరీ ఆవిష్కరణ

నిర్మల్ కల్చరల్, జనవరి 6: పద్మశాలి ఇంజనీర్ల సంఘం రూపొందించిన నూతన సంవత్సరం 2024 డైరీని శనివారం నిర్మల్ పట్టణంలోని విశ్వేశ్వరయ్య భవనంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, ప్రచాన కార్యదర్శులు మధుకర్, ఉమాశంకర్, ఆర్ అండ్ బీ ఈఈ వి.అశోక్‌కుమార్, హన్మాండ్లు, సందీప్ కుమార్, పీఆర్ ఈఈ శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతపై అవగాహన

తానూర్, జనవరి6: మండలంలోని హిప్నెల్లి తండాలో శుక్రవారం బేటీ బ చావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మిషన్ శక్తి మహిళా సాధికారత్ కేంద్రం ఆధ్వర్యంలో రక్తహీనతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మిషన్ శక్తి జెండర్ స్పెషలిస్టు జ్యోతి, మౌనికలు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు బలమైన పౌష్టికహారం తీసుకుంటే రక్తహీనతను అధిగమించ వచ్చిని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు, వైద్యాధికారు లు, ఆశావర్కర్స్ హెల్త్‌సూపర్‌వైజర్స్, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

ఆన్‌లైన్‌లోకి ప్రజాపాలన దరఖాస్తులు

● ముగిసిన ప్రజాపాలన కార్యక్రమం ● దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడంలో అధికారులు బిజీబిజీ ● మొరాయిస్తున్న సర్వర్లు

భైంసా, జనవరి 6: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న ఆరు గ్యారెంటీల పథకాలను అమలు చేసేందుకు ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగానే అభయహస్తం కింద మహాలక్ష్మీ, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మఇళ్లు, చేయూత కింద సహాయం చేసేందుకు ప్రజాపాలనపేరిట దరఖాస్తుల స్వీకరణ చేపట్టింది. గతనెల 28న ప్రారంభమైన ప్రజాపాలన కార్యక్రమం శనివారం ముగిసింది. అధికారయంత్రాంగం సెలవుదినాలు మినహా 8రోజులపాటు గ్రామాలు, పట్టణాల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులను తీసుకుంది. సంబంధిత దరఖాస్తు పత్రాలన్నింటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను చేపట్టారు.



● నిర్మల్‌లో ఆధార్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న ఆపరేటర్లు

● ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో..

ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అభ యహస్తం కింద స్వీకరించిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను అధికార యంత్రాంగం వేగవంత ం చేసింది. ప్రభుత్వం ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియకు అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది. గ్రామాలకు సంబంధించిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయాల్లో, పట్ట ణాల పరిధిలో స్వీకరించిన వాటికి మున్సిపల్ కార్యాలయాల్లో ఆన్‌లైన్‌లో నమోదుచేస్తున్నారు.

● ఆశల పల్లకీలో దరఖాస్తుదారులు

అభయహస్తం పథకానికి అన్ని ప్రాంతాల నుంచి భారీగా దరఖాస్తులు వచ్చాయి. వీటిల్లో నుంచి అర్హులైన వారిని ఎలా ఎంపిక చేస్తారనే విషయంలో ఇప్పటికి మార్గదర్శకాలు జారీ కాలేదు. వచ్చె నెల నుంచి మహిళలకు రూ.2500 అ ందిస్తామని ఓ వైపు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో దరఖాస్తుదారుల్లో ఆశలు కలుగుతున్నాయి. అధికార యంత్రాంగం దరఖాస్తులన్నింటి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రభుత్వానికి నివేదించనున్నారు. అయితే సంబంధితనివేదికలోని దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించపచేసి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారా లేదా దరఖాస్తుదారులందరికీ లబ్ధి చేకూరుస్తారా అనే విషయం నేటికి స్పష్టత రాలేదు. కాగా దరఖాస్తుదారులు మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వంతో తమకు లబ్ధి చేకూరనుందనే ఆశల పల్లకీలో ఊరేగుతున్నారు.

● సర్వర్ మొరాయింపుతో నత్తనడకన ఆన్‌లైన్ ప్రక్రియ

ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా వచ్చిన అభయహస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. నమోదుకు సంబంధించిన సర్వర్ మొరాయించడంతో ఆన్‌లైన్ నమోదుకు సమస్యలు ఏర్పడుతున్నాయి. శనివారం మధ్యాహ్నం 11.30 సాయంత్రం 4 గంటల వర కు సర్వర్ మోరాయించడంతో ఆన్‌లైన్ నమోదు నిలిచిపోయింది. శుక్రవారం సైతం సర్వర్ మోరాయింపు మూలంగా నమోదు అంతంత మా త్రంగానే జరిగినట్లుగా తెలిసింది.

బహిరంగంగా తెల్లకల్లు విక్రయాలు!

● బెల్ట్‌షాపులో ఆగని విక్రయాలు?

ఉట్నూర్, జనవరి 6: ఉట్నూర్ గిరిజన ప్రాంతాలలో తెల్లకల్లు విక్రయాలపై నిషేధం ఉన్నప్పటికీ కొంతమంది బహిరంగంగానే తెల్లకల్లు అమ్మకాలు నిర్వహిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాలో కల్లు అమ్మకాల లైసెన్సులను కేవలం గిరిజనులకు మాత్రమే ఇవ్వాలన్నా నిబంధనలు ఉండడంతో అబ్కారీ శాఖ అధికారులు గిరిజనేతరులకు లైసెన్సులు కేటాయించ లేదు. గత దశాబ్దాల కాలంగా కులవృత్తిని నమ్ముకుని జీవిస్తున్న గిరిజనేతరులు లక్కారం, హర్కాపూర్, రామ్‌లింగంపేట, ప్రాంతాలలో తెల్లకల్లు విక్రయాలు కొనసాగిస్తున్నారు.

● కొనసాగుతున్న బెల్ట్‌షాపులు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే బెల్టు షాపులు ఎత్తి వేస్తామని ప్రకటించారు. అన్న విధంగానే బెల్ట్‌షాపులు మూసి వేయాలని అధికారులను ఆదేశించారు. కాని వైన్స్ షాపుల్లో అమ్మకాలు పెరగడానికి బెల్ట్‌షాపులు ఎంతో అవసరమని భావిస్తున్న ఎక్సైజ్ అధికారులు బెల్ట్‌షాపులను నియంత్రించ లేక పోతున్నారు. ఇది ఆసరాగా బెల్ట్‌షాపు నిర్వాహకులు ప్రతి బాటిల్‌పై ఎమ్మార్పీ ధర కంటే పది రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారని మద్యం ప్రియలు పేర్కొంటున్నారు. అంతేకాకుండా స్థానిక వైన్ షాపుల యజమానులు సైతం బెల్ట్‌షాపుల వారికి బాటిల్‌కు రూపాయలు ఐదు అదనంగా తీసుకుంటున్నారని.. అందుకే తాము సైతం రూ.10 తీసుకోవాల్సి వస్తుందని బెల్ట్‌షాపుల నిర్వాహకులు పేర్కొనడం గమనార్హం. ఏజెన్సీలోని ఉట్నూర్, ఇంద్రవెల్లి, గాదిగూడ మండలాల్లో బెల్ట్‌షాపులో ఉన్న వెంటనే మూసివేయాలని గిరిజన నాయకులు కోరుతున్నారు.



ఓ గ్రామంలో రోడ్డు పైన తెల్లకల్లు విక్రయిస్తున్నారిలా..



ముక్కుకు చేతిగుడ్డను అడ్డం పెట్టుకుని మరుగుదొడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్

ముక్కు మూసుకోవాల్సిందేనా?!

● మైనార్టీ పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే

ఆదిలాబాద్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండల కేంద్రంలోని మైనార్టీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలను శనివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థు లకు అందిస్తున్న భోజన వసతి, మరుగుదొడ్లను పరిశీలించారు. అయితే మరుగుదొడ్లు అధ్వానంగా మరి దుర్గంధం వెదజల్లడంతో ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ముక్కు మూసుకుని పరిశీలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పాఠశాల సిబ్బందిపై ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దృశ్యాలను చూస్తే గురుకుల పాఠశాల మరుగుదొడ్ల పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో ఇట్టే తెలుస్తూనే ఉంది.

గ్రామాల్లో రాములోరి అక్షింతల పంపిణీ

బోథ్, జనవరి6: మండలంలో శనివారం అయోధ్య రాముని అక్షింతలను పలు గ్రామాలలో భక్తులు పంపిణీ చేశారు. శుక్రవారం మండల కేంద్రం నుంచి తీసుకువెళ్లి అక్షింతలు గ్రామాలలోని దేవాలయాల్లో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శనివారం గ్రామాలలో రామనామ కీర్తనలతో భాజా భజంత్రీల మధ్యన మహిళలు మంగళ హారతులతో ముందుండి నడుస్తూ ఇంటింటికి అక్షింతలను పంపిణీ చేశారు. బోథ్ మండల కేంద్రంతో పాటు పొచ్చెరా, కౌటా(బి), కనుగుట్ట, సోనాల గ్రామాలలో అక్షింతలను పంపిణీ చేశారు.

కరత్వాడలో మిషన్ భగీరథ నీరు లీకేజీ

● రోడ్లన్నీ బురదమయం

బోథ్, జనవరి 6: మండలంలోని కొత్త కరత్వాడ గ్రామంలో మిషన్ భగీరథ పథకం పైప్‌లు పగిలి నీరు రోడ్లపైకి వస్తోంది. దీని ఫలితంగా రోడ్లన్నీ బురదమయంగా మారాయని గ్రామస్థులు వాపోతున్నారు. లీక్ అవుతున్న నీటి వల్ల రోడ్డుపై నడిచేందుకు ఇబ్బందులు తప్పడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. నీరు లీక్ అవుతున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువచ్చిన పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి పగిలిన పైప్‌ల స్థానంలో కొత్త పైప్‌లైన్లు వేయాలని కోరుతున్నారు. లీకేజీల వల్ల భగీరథ నీరు కలుషితమవుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు.



కరత్వాడలో బురదమయంగా మారిన రోడ్డు

సమ్మక్క-సారలమ్మను దర్శించుకున్న ఎంపీ

బోథ్, జనవరి 6:వరంగల్ జిల్లాలోని సమ్మక్క సారలమ్మ దేవతలను శనివారం ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు, బోథ్ మండల ఆదివాసీ నాయకులతో కలిసి సందర్శించారు. ఆదివాసీల ఆరాధ్య దేవతలైన సమ్మక్క సారలమ్మ అమ్మలను దర్శించుకునేందుకు వెళ్లిన వారిలో మండల ఆదివాసి నాయకులు పంద్రం శంకర్‌తో పాటు పలు గ్రామాల పటేల్‌లు పాట్నాపూర్ గ్రామ మాజీ సర్పంచ్, న్యాయవాది పంద్రం శంకర్, తదితరులు ఉన్నారు.

అభయహస్తం దరఖాస్తుల పరిశీలన

మావల, జనవరి 6: అభయహస్తం దరఖాస్తు స్వీకరణ చివరి రోజు సందర్భంగా తెలంగాణ ప్రదేశ్ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి మావల మండలంలోని గ్రామాల్లోని వార్డుల పరిస్థితిని శనివారం పరిశీలించారు. మండలంలోని నాగపూర్, సావర్గాం, మావల గ్రామాలతో పాటు ఆదిలాబాద్ మున్సిపాలిటీలో గల వార్డులు దుర్గా నగర్, కె ఆర్ కే కాలనీ, పిట్టలవాడ, కైలాస్ నగర్, షాద్ నగర్, ధోబి కాలనీ, దస్నాపూర్, టీచర్స్ కాలనీ, సుభాష్ నగర్, రాంనగర్, న్యూ హౌసింగ్ బోర్డ్ కాలనీలలో ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ ప్రొగ్రెస్ రిపోర్టు తీసుకున్నారు. ఎవరైనా దరఖాస్తు చేసుకోని వారు ఉంటే మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. ఆయన వెంట మావల వైస్ ఎంపీపీ అట్ల గోవర్ధన్ రెడ్డి, మావల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు చరణ్ గౌడ్, శ్రీరామ్, హయాజ్, సురేష్, ఫెరోజ్ ఖాన్, లింగన్న ప్రభాకర్, తదితరులు ఉన్నారు.



అభయహస్తం దరఖాస్తుల ప్రక్రియను పరిశీలిస్తున్న కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి



'ప్రపంచ మార్పు విద్యావంతులతోనే సాధ్యం'

ఖానాపూర్,జనవరి6: ప్రపంచ మార్పు విద్యావంతులచే సాధ్యమని రూమ్ టు రీడ్ ఖానాపూర్, మామడ మండలాల లిటరసీ ఫెసిలిటేటర్ ఎల్.శ్రీనివాస్ అన్నారు. శనివారం ఖానాపూర్ మండలం పాత ఎల్లాపూర్‌లోని ప్రాథమిక పాఠశాల సందర్శించి మాట్లాడారు. గ్రంథాలయ పుస్తకాలను తరగతి వారీగా, పిల్లలు స్థాయిని బట్టి వినియోగించుకోవాలని తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపయోగపడే పుస్తకాలు, విద్యార్థులను ఆకట్టుకునేలా ఉండే కథల పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో లిటరసీ ఫెసిలిటేటర్ డి.రాజేందర్, హెచ్ఎం ఆర్తిమారుతి స్వామి ఉన్నారు.

- ఓడిన ఎమ్మెల్యే అభ్యర్థులకు అత్యంత ప్రాధాన్యం
- స్థానిక ఎమ్మెల్యేలతో సమానంగా అనధికారిక బాధ్యతలు
- బీజేపీ ఎమ్మెల్యేలకు ధీటుగా కాంగ్రెస్ రాజకీయం
- మరికొద్ది రోజుల్లో అంచనాలు తారుమారు
- లోక్‌సభ ఎన్నికల వరకు జిల్లాలో మారనున్న పొలిటికల్ సీన్

సూపర్ పవర్!



నిర్మల్, జనవరి6 (ఆంధ్రజ్యోతి): అధికార కాంగ్రెస్‌పార్టీ తన పట్టును మరింత పటిష్ఠ పర్చుకునేందు కోసం పకడ్బందీ ఎత్తుగడలను వేస్తోంది. తాము అధికారంలోకి వచ్చినప్పటికీ తమ అభ్యర్థులు ఓడిన చోట కూడా సమాంతర వ్యవస్థకు కేంద్ర బిందువు కావాలని ఆ పార్టీ భావిస్తోంది. దీనికి అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ ఓడిన నియోజకవర్గాల్లో అక్కడ ఆ పార్టీ తరపున పోటీచేసిన అభ్యర్థికే అత్యధిక ప్రాధాన్యతనివ్వబోతోంది. ముఖ్యంగా నిర్మల్ జిల్లాలోని నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీచేసి ఓటమి పాలైన నేతలు ప్రస్తుతం వారి నియోజకవర్గాల్లో సూపర్‌పవర్‌గా మారనున్నారంటున్నారు. వీరిద్దరి చుట్టూ జిల్లా రాజకీయం ముందుకెళ్తోందని చెబుతున్నారు.

మొన్నటి ఎన్నికల్లో నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిన సంగతి తెలిసిందే. రెండు నియోజకవర్గాల్లో బీజేపీ అనూహ్యంగా భారీ ఓట్లు సాధించి గెలుపును కైవసం చేసుకుంది. ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఇక్కడ రాజకీయమంతా ఏకపక్షం కానుంది. నిర్మల్ నియోజకవర్గంలో బీజేపీ పార్టీ తరపున పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందిన మహేశ్వర్‌రెడ్డి ఇప్పటికే తన అధికార దర్పణాన్ని చాటుకుంటున్నారు. అధికారంలో కాంగ్రెస్‌పార్టీ ఉన్నప్పటికీ ఎమ్మెల్యేగా జిల్లా యంత్రాంగంపై తానే ప్రభావం చూపుతానంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే దీనికి కౌంటర్‌గా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, ఇటీవలే ఎన్నికల పోటీ చేసి ఓడిపోయిన శ్రీహరిరావును పార్టీ అధిష్ఠానం తెరపైకి తెస్తోంది. స్థానిక ఎమ్మెల్యే బలమైన నేతగా కొనసాగుతున్న నేపథ్యంలో ఇక నుంచి పరోక్ష అధికార బలాన్ని శ్రీహరిరావుకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం అప్పగించబోతున్నట్లు సమాచారం. దీనికి అనుగుణంగానే గత 10 రోజుల నుంచి వివిధ శాఖల ఉద్యోగులు, పోలీసు అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరిరావును కలిసేందుకు పోటీ పడుతుండడం చర్చనీయాంశమవుతోంది. దీంతోపాటు ప్రజాపాలన కార్యక్రమాల వద్ద కూడా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరిరావుకు సంబంధించిన బ్యానర్లు కడుతున్నారు. స్థానికంగా ఉండాల్సిన ఎమ్మెల్యే అందుబాటులో లేకపోతుండడం కూడా కాంగ్రెస్ పార్టీకి కలిసి వస్తోందని అంటున్నారు. ఎమ్మెల్యేగా మహేశ్వర్‌రెడ్డి కొనసాగుతున్నా కాంగ్రెస్ అధిష్ఠానం మాత్రం శ్రీహరిరావుకు పరోక్షంగా అండనిస్తున్న కారణంగా జిల్లా అధికారులు ఎమ్మెల్యే మాటకే కాకుండా శ్రీహరిరావు మాటకు కూడా ప్రాధాన్యతనిచ్చే అవకాశాలు ఏర్పడుతున్నాయంటున్నారు. ఇప్పటికే ప్రభుత్వం నుంచి జిల్లా అధికారులకు దీనికి సంబంధించిన మౌకిక ఆదేశాలు జారీ అయినట్లు చెబుతున్నారు. ఇందులో భాగంగానే పలువురు పోలీసు అధికారులు సైతం శ్రీహరిరావును ఆయన ఇంట్లో కలవడం ప్రాధాన్యతకు కారణమవుతోంది. అలాగే ముథోల్ నియోజకవర్గంలో కూడా బీజేపీ అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ ఇక్కడ కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేసి ఓటమి చెందిన నారాయణరావు పటేల్‌కు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం అత్యంత ప్రాధాన్యత కల్పించబోతోందంటున్నారు. ఇక్కడి ఎమ్మెల్యేకు సమాంతరంగా ప్రభుత్వ కార్యకలాపాల పేరిట చురుకైన పాత్ర పోషించేందుకు నారాయణరావు పటేల్‌ను కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఇప్పటికే పురమాయించిందంటున్నారు. స్థానిక ఎమ్మె ల్యేతో సమానంగా కాంగ్రెస్ అభ్యర్థి నియోజకవర్గంలో సమాంతర రాజకీయ కార్యకలాపాలు కొనసాగించేందు కోసం కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఇప్పటికే అన్ని రకాల చర్యలు తీసుకుందంటున్నారు.

నిర్మల్ నియోజకవర్గంలో..

నిర్మల్ నియోజకవర్గంలో ప్రస్తుతం విచిత్ర రాజకీయ పరిస్థితులు నెలకొంటున్నాయంటున్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రధాన ప్రతిపక్షంగా కొనసాగనుండగా బీజేపీ కేవలం ఎనిమిది మంది ఎమ్మెల్యే స్థానాలకే పరిమితమైంది. దీంతో ప్రతిపక్ష పరంగా విశ్లేషిస్తే బీజేపీ కన్నా బీఆర్ఎస్ బలంగా ఉందని చెబుతున్నారు. కాగా, అధికారంలో కాంగ్రెస్ ఉన్న కారణంగా ప్రస్తుతం ఆ పార్టీ సూపర్‌పవర్‌గా పేర్కొంటున్నారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్‌పార్టీ తరపున ఓటమి చెందిన పార్టీ జిల్లా అధ్య క్షుడు శ్రీహరిరావుకు అధిష్ఠానం అత్యంత ప్రాధాన్యత కల్పిస్తుందని చెబుతున్నారు. ఇప్పటికే దీనికి సంబంధించి జిల్లా ఉన్నతాధికారులకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం పరోక్ష పద్ధతిలో దిశానిర్దేశం చేసిందంటున్నారు. దీని కారణంగానే ఓ వైపు ఆయా శాఖల అధికారులు, మరోవైపు పోలీసు ఉద్యోగ సంఘాలు వేర్వేరుగా శుభాకాంక్షల పేరిట శ్రీహరిరావును స్వయంగా కలుస్తుండడం చర్చనీయాంశమవుతోంది. అధికారులు సైతం పరోక్షంగా పలు సమస్యలపై శ్రీహరిరావుతో చర్చలు జరుపుతున్నారంటున్నారు. బీజేపీకి చెందిన ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డితో అధికారులు టచ్‌లోనే ఉంటూ తమ వంతుగా కాంగ్రెస్ నేతలకు సైతం ప్రాధాన్యతనిస్తున్నారంటున్నారు.

ముథోల్ సెగ్మెంట్‌లో..

ముథోల్ నియోజకవర్గంలో కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఓడిపోయిన సంగతి తెలిసిందే. ఇక్కడ కూడా బీజేపీ అభ్యర్థి రామారావు పటేల్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. కాగా ఈ నియోజకవర్గంలో తమ పార్టీ తరపున ఓటమి చెందిన నారాయణరావు పటేల్ మాటే చెల్లుబాటు అయ్యే విధంగా కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం అన్నిరకాల చర్యలు చేపట్టిందంటున్నారు. ఎమ్మెల్యేతో సంబంధం లేకుండానే కాంగ్రెస్ తరపున పోటీచేసిన నారాయణరావు పటేల్‌కు ప్రత్యేక ప్రాధాన్యతనివ్వాలంటూ కూడా సంబంధిత అధికారులకు అధిష్ఠానం నుంచి రహస్య ఆదేశాలు అందినట్లు చెబుతున్నారు. దీంతో భైంసాలోని నారాయణరావు పటేల్ క్యాంపు కార్యాలయం జనంతో కిటకిటలాడుతోంది. గతంలో ఓటమిచెందిన అభ్యర్థి ఇంటికిరావడానికి సంశయించే వారు, ప్రస్తుతం మాత్రం ఉత్సాహంగా కాంగ్రెస్ నేతల ఇంటికి వస్తూ తమ సమస్యలను వెల్లడిస్తున్నారు. కాంగ్రెస్ నేతలు సైతం సంబంధిత శాఖ అధికారులకు ఫోన్లుచేసి తమ వారికి ప్రాధాన్యతనివ్వాలని చెబుతున్నారు.

పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యాన్ని సహించం

- మున్సిపల్ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

నిర్మల్ కల్చరల్, జనవరి6: నిర్మల్ జిల్లాలోని మున్సిపాలిటీలో పన్నులు వసూలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించే ప్రసక్తి లేదని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి మున్సిపల్ అధికారులు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గత ఏప్రిల్ నుండి ఇప్పటి వరకు వసూలు చేసిన పన్నుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యంపై నిర్మల్ కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు చెప్పే సమాధానాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అసలు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నారా లేదా అని ప్రశ్నించారు. రిజిస్టర్లు, రికార్డులు, ఆన్‌లైన్ రిపోర్టులను ఆయన పరిశీలించారు. మొండి బకాయిలు వాసులు చే యాలని, ఎక్కువ మొత్తం బకాయి ఉన్న వారిని గుర్తించి చర్య తీసుకోవాలని నోటీసులు జారీ చేయాలన్నారు. విధులు నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలుంటాయన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సింగ్వాన్

నేడు ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు



నిర్మల్ చైన్‌గేట్, జనవరి 6: 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన' ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం జిల్లా కేంద్రంలో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. ఇందుకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. హరిహర క్షేత్రం అయ్యప్ప ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో మహిళలు పాల్గొననున్నారు. ఆలయ ధర్మకర్త, ప్రముఖ పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్ రెడ్డి ముగ్గుల పోటీల ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

దళారులను నమ్మొద్దు

- అధికారులు స్వచ్ఛందంగా పని చేయాలి: ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

పెంబి, జనవరి6: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను కొందరు దళారులు తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నం చేస్తారని, ప్రజలు దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం పెంబి మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా గ్రామస్థులు డోలు వాయిద్యాల మధ్య ఘనస్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు. పేదల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని, ప్రజలు ఎవరూ దళారులను నమ్మొద్దని అధికారులు ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అక్రమంగా ఇసుక తరలించి వారి బండ్ల సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రైతువేదికలో ఏర్పాటుచేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. ఎమ్మెల్యేకు పలువురు సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ అంబాజీ, సర్పంచ్ శేఖర్‌గౌడ్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో చిక్యాల రత్నాకర్ రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సల్ల స్వప్నిల్ రెడ్డి, నాయకులు తులాల శంకర్, భూమేష్, గుడిసె రమేష్, అశోక్ రావు, ఏవో రవి, ఐకేపీ ఏపీవో గంగారెడ్డి, ఏఈవో గంగాజల, రాజ్ కుమార్, పంచాయతీ సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.



తవ్వకాలను అడ్డుకుంటున్న గ్రామస్థులు

మొరం తరలింపును అడ్డుకున్న గ్రామస్థులు

దిలావర్‌పూర్, జనవరి6: మండలంలోని బన్సపల్లి శివారులో ఉన్న ఇసుక గుట్ట నుంచి అక్రమంగా మొరం తరలించడాన్ని శనివారం ఆ గ్రామస్థులు అడ్డుకున్నారు. ఇసుక గుట్టపై దర్గా ఉందని, అయితే కొంతమంది రాజకీయ పలుకుబడితో గుట్ట చుట్టూ తవ్వుతూ మొరంను తరలించుకుపోతున్నారని గ్రామస్థులు ఆరోపించారు. మొరం తవ్వడం వల్ల గుట్ట కుచించుకుపోతోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయమై అధికారులకు ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. బన్సపల్లి, కంజర్, ఒడ్డేపల్లి గ్రామస్థులంతా కలిసి దిలావర్‌పూర్ తహసీల్దార్‌కు, ఎస్సైకి ఫిర్యాదు చేశారు. వెంటనే మొరం తవ్వుతున్న జేసీబీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక గుట్టను కాపాడాలని వారు కోరుతున్నారు.

హైకోర్టు స్టేతో ఆగిన అవిశ్వాస పరీక్ష

సారంగాపూర్, జనవరి6: సారంగాపూర్ మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్షులపై సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస పరీక్ష హైకోర్టు స్టేతో ఆగిపోయింది. ఈ మేరకు గత డిసెంబరు 13న తొమ్మిది మంది ఎంపీటీసీలు అవిశ్వాస నోటీసును ఆర్డీవోకు అందజేశారు. అనంతరం సదరు సభ్యులు క్యాంపునకు తరలివెళ్లారు. దరిమిలా జనవరి 6న ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో సభ్యులకు సమాచారం అందించారు. శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి తొమ్మిది మంది ఎంపీటీసీ సభ్యులు హాజరయ్యారు. దీంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. కాగా వైస్ఎంపీపీ పతాని రాధ హైకోర్టును ఆశ్రయించడంతో కోర్టు స్టే ఇచ్చింది. దీంతో అవిశ్వాస తీర్మాన వ్యవహారం మరికొంత కాలం కొనసాగనుంది.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నిర్మల్ కల్చరల్, జనవరి 6: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారంటీలు సంక్షేమ పథకాలు ప్రజలు ఉపయోగించుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ కోరారు. శనివారం పట్టణంలోని 11వార్డు పరిధిలో శరత్ మహల్‌లో నిర్వహిస్తున్న ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. మహిళలు, పురుషులకు వేరువేరుగా కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. అధికారులను సంప్రదించి అనుమానాలు నివృత్తి చేసుకోవాలన్నారు. ఆయనవెంట కౌన్సిలర్ సలీం, స్థానికులు పాల్గొన్నారు.



ప్రజాపాలనలో దరఖాస్తును స్వీకరిస్తున్న చైర్మన్

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు: ఆర్డీవో

కుభీర్, జనవరి6: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి సేకరించిన దరఖాస్తు వివరాలను సేకరించి అర్హులందరికీ సంక్షేమ ఫలా లు అందేలా చర్యలు చేపట్టాలని ఆర్డీవో కోమల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలకేంద్రంలోని ఐకేపీ సమావేశ కార్యాలయంలో మండల పంచాయతీ కార్యదర్శులతో ప్రజాపాలన దరఖాస్తుల డాటా నమోదుపై శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీవో కోమల్‌రెడ్డి మాట్లాడారు. ప్రజాపాలన దరఖాస్తులను సంబంధిత వెబ్‌సైట్‌లలో ఎలాంటి పొర పాటు లేకుండా పారదర్శకంగా నమోదు ప్రక్రియ చేపట్టాలని అన్నారు. శవారంతో ముగిసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం 98శాతం పూర్తయినట్లు తెలిపారు. దరఖాస్తులడేటా నమోదు ఈనెల 17వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులకుడేటా నమోదు కోసం కంప్యూటర్లను అందజేస్తామని పేర్కొన్నారు. కంప్యూటర్‌లలో క్రోడీకరించిన దరఖాస్తుల్లో ఎలాంటి తప్పుల దొర్లకుండా నమోదు చేయాలని అన్నారు. ప్రజల నుంచి సేకరించిన దరఖాస్తులు మిస్‌అవ్వకుండా చూడాలని అన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యల తీసుకుంటామని హెచ్చరించారు. ఈ డేటా వివరాల ఆధారంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి హన్మండ్లు, తహసీల్దార్ సోము, ఎంపీడీవో లింబాద్రి, ఎంఈవో చంద్రకాంత్, ఏపీవో హరిలాల్, తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కోమల్‌రెడ్డి